## క్లుప్తంగా

### సాయి భక్తుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న సాయి భక్తులు

**మడకశిర:** పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఈ వేడుకల్లో నియోజకవర్గంలోని ప్రజలను భాగస్వామ్యం చేయడానికి వీలుగా సాయి భక్తులు 15 రోజులుగా భిక్షాటన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో భిక్షాటన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు కుంభాభిషేకం

**మడకశిర:** పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళేశ్వర స్వామికి సోమవారం కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 10 రోజులుగా వర్షం రాకపోవడంతో కుంభాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

### జూదరుల అరెస్ట్

**లేపాక్షి:** కంచిసముద్రం గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తుండగా ఆదివారం దాడి చేసినట్లు ఎస్‌ఐ గోపీ తెలిపారు. ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి రూ. 2240 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### 117 జీఓ రద్దు చేయాలి

**మడకశిర:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 117 జీఓ రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని కేపీ పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ జోనల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈజీఓను ఏమాత్రం ఆలస్యం చేయకుండా రద్దు చేయాలన్నారు. మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మహాలింగప్ప, జోగప్ప, గుడిబండ నాయకులు నరసింహప్ప,గిరి పాల్గొన్నారు.

### సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



**అమరాపురం :** హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధేశ్వరస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా వివిధ పూలతో స్వామి వారిని అలంకరించి అర్చకులు మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకుప్రసాద వినియోగం చేశారు.

**రొళ్ల:** టీడీ పల్లి గ్రామ సమీపాన వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి మూల ప్రతిమకు గంగా జలంతో శుద్ధి చేసి అభిషేకించారు. తర్వాత వెండి ఆభరణాలు, పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### కొల్లాపురమ్మకు పూజలు



కొల్లాపురమ్మ మూలవిరాట్

**పావగడ:** పట్టణంలోని తాలూకా కార్యాలయ ఆవరణలో వెలసిన ఆదిశక్తి కొల్లాపురమ్మ దేవికి ఆదివారం ఆషాఢమాస పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కొల్లాపురమ్మ విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు సూర్యనారాయణ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### జాబ్‌మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**మడకశిర:** పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఆదివారం ప్రారంభించారు. ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో స్థానిక మహిళలకు ఉపాధి కల్పించడానికి ఈ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ప్రతి నిధులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని వాల్మీకి సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

# పేదల గుండెల్లో వైఎస్సార్





మడకశిరలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల



పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్

- నేడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి
- సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- వైఎస్సార్ హయాంలో జరిగిన మంచిని గుర్తు చేసుకుంటున్న జనం

**నిరుపేదల పెన్నిధి, రైతు బాంధవుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మనకు దూరమై 15 ఏళ్లు అవుతోంది. మన మధ్యన ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన జ్ఞాపకాలు ఇంకా నిలిచే ఉన్నాయి. ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 వాహనాలు, జలయజ్ఞం ఇలా ఒక్కటేంటి ఎన్నో సంక్షేమ పథకాలతో ఆయన పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన సేవలను ప్రజలు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు.**

**హిందూపురం:** ఉమ్మడి ఏపీ సీఎంగా దివంగత వైఎస్సార్ రెండు తెలుగు రాష్ట్రాలను సస్యశ్యామలం చేశారు. తన హయాంలో అనేక ప్రాజెక్టులు, మంచినీటి పథకాలు చేపట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చి హిందూపురం వాసుల నీటి ఎద్దడి తీర్చారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల ప్రజలతో వైఎస్సార్ జీవితం ముడిపడి ఉంది. వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో వైఎస్సార్ చేసిన మేలు ఎంతో ఉంది. ఆయన అమలు చేసిన పథకాలతో ఈ ప్రాంతంలో లక్షలాది మంది జీవితాలు బాగుపడ్డాయి. 2004 ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ హిందూపురం వచ్చారు. ఆ సమయంలో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోయే పరిస్థితులు కళ్లారా చూశారు. మాకు ఏమీ ఇవ్వకున్నా ఫర్వాలేదు. తాగునీటి సమస్యను తీర్చండి చాలు అంటూ ప్రజలు వినతులు అందించారు. ఇక్కడ పార్టీ ఓడినా, గెలిచినా నీటి ఎద్దడి తీరుస్తాను అని మాట ఇస్తున్నా అని అన్నారు. మాట ఇస్తే వెనుకడుగు వేసే ప్రస్తక్తే లేని వైఎస్సార్ అధికారంలోకి రాగానే పీఏబీఆర్ నుంచి ప్రత్యేక పైపులైన్ల ద్వారా తాగునీటిని తరలింపజేసేందుకు రూ.650కోట్లతో శ్రీరామరెడ్డి తాగునీటి పథకాన్ని చేపట్టారు. దాదాపు 1400 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయించి 2008 డిసెంబరు 30న హిందూపురం పట్టణ నడిబొడ్డున రహమత్ పురం సర్కిల్ వద్ద శ్రీరామరెడ్డి నీటి పథకం పైలాన్‌ను వైఎస్సార్ ప్రారంభించారు. వైఎస్ పుణ్యమా అని హిందూపురం పట్టణ ప్రజల దాహార్తి తీరడమే కాకుండా పక్కనేనున్న మడకశిర, పెనుకొండ నియోజకవర్గం పరిధిలో 220 గ్రామాలకూ తాగునీరు అందింది. జలయజ్ఞంలో భాగంగా అనంత వెంకటరెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కింద మడకశిర ఉపకాలువ కింద 55వ ప్యాకేజీలో 64 కిలోమీటర్ల మేర కాలువ తవ్వేందుకు వైఎస్ చూపిన చొరవ మరువలేనిది. మొదటిసారి రూ.48 కోట్లతో ఈ పనులను చేపట్టడంతో ఈ ప్యాకేజీ కింద హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండలాల పరిధిలో ఉన్న 99 చెరువులకు నీరందించడానికి మార్గం సుగమమై ఆపనులు కూడా 90శాతం పూర్తిచేశారు. ఆ తర్వాత గెద్దెనెక్కిన ప్రభుత్వాలు అంతోఇంతో 10శాతం పూర్తి చేసి తామే పూర్తిచేసినట్లు ప్రచారం చేసుకోవడం గమనార్హం.

**వైఎస్ హయాంలో మడకశిరకు మహర్దశ**

**మడకశిరరూరల్:** జిల్లాలోనే పూర్తిగా వెనుకబడిన మడకశిర నియోజకవర్గం వైఎస్సార్ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. 2004లో రెండో విడత పల్లెబాట కార్యక్రమంలో భాగంగా అమరాపురం, గుడిబండ, మడకశిర మండలాల్లో పర్యటించారు. మడకశిరలో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ, హార్టికల్చర్, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశారు. అమరాపురం, గుడిబండ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయించారు. వక్కలిగ, సాదర, వీరశైవ కులాల వారిని బీసీలుగా గుర్తించి ఆదుకున్నారు. నియోజకవర్గానికి 40వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసి పేదలకు గూడు కల్పించారు. హంద్రీనీవా పథకంలో భాగంగా మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను మంజూరు చేశారు. మడకశిర ప్రాంతంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి పారిశ్రామిక వాడ ఏర్పాటుకు చొరవ చూపారు. అవసరమైన భూములు సేకరించడానికి అధికారులు శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. వైఎస్సార్ అందించిన సంక్షేమ పథకాలు, మానవీయ సుపరిపాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.

**వైఎస్సార్ చలువతో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం**

**పెనుకొండ:** దివంగత వైఎస్సార్ చొరవతో పెనుకొండ వాసుల దాహార్తి తీరింది. ఆయన హయాంలో నిర్మించిన పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్ రైతాంగానికి, ప్రజల తాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోంది. 1983లో అప్పటి సీఎం ఎన్టీఆర్ హయాంలో గొల్లపల్లి రిజర్వాయర్‌కు అంకురార్పణ జరిగింది. అయితే అది ప్రతిపాదనలతోనే నిలచిపోయింది. 2005లో వైఎస్సార్ ఈ రిజర్వాయర్ నిర్మాణంపై దృష్టి సారించారు. ఈ పథకం ద్వారా రాయలసీమ ప్రజల సాగు, తాగునీరు అవసరాలను తీర్చగలమని భావించి రిజర్వాయర్ నిర్మాణం కోసం భగీరథుడిలా కంకణం కట్టుకుని వేల కోట్ల రూపాయలు మంజూరు చేశారు. మహానేత చలువతోనే నేడు రాయలసీమ ప్రాంతాలకు గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా అటు సాగునీరు, ఇటు తాగునీరు అందిస్తున్నారు.

### కుంచిటి వక్కలిగలకు వైఎస్సార్ దేవుడు



మడకశిర నియోజకవర్గంలో 85 వేల మందికి పైగా ఉన్న కుంచిటి వక్కలిగలను బీసీలుగా గుర్తించి విద్య, ఆర్థికంగా బలపడడానికి వైఎస్సార్ కృషి చేశారు. బీసీలుగా గుర్తించడంతోనే కుంచిటి వక్కలిగ సముదాయంలోని పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారు. వైఎస్సార్ చేసిన మేలును మరిచిపోలేం.

–డాక్టర్ నళిని, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్

### రైతు పక్షపాతి డాక్టర్ వైఎస్సార్



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు పక్షపాతి. వ్యవసాయ రంగానికి విద్యుత్ బకాయిలు మాఫీ చేసి నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించి రైతుల కళ్లల్లో ఆనందాన్ని కలిగించిన మహానేత. రెండు వ్యవసాయ బోర్లకు రూ.40 వేల విద్యుత్ బకాయిలు మాఫీ అయింది.

–రైతు శ్రీరామప్ప,హెచ్‌ఆర్‌పాళ్యం, మడకశిర మండలం

### వైఎస్సార్ చలువతోనే చెరువులకు నీరు



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చలువతోనే గొల్లపల్లి రాజర్వాయర్ నిర్మాణం జరిగింది. రాయలసీమ ప్రాంతవాసుల సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించాలన్న ఆలోచనతో వేల కోట్ల నిధులు విడుదల చేసి ఈ ప్రాంత ప్రజల గుండెల్లో కొలువయ్యారు.

–వెంకటేశులు, రైతు, కొత్తపల్లి, రొద్దం మండలం

## వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయండి

**మడకశిర:** నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. వాడవాడలా ఈవేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సేవా కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని మండల కేంద్రాల్లో ఈవేడుకలను విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ విగ్రహాలు ఉన్న చోట్ల ఈ జయంతి వేడుకలను మరింత భారీ ఎత్తున నిర్వహించాలని కోరారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

**హిందూపురం:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయాలని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ టీఎన్ దీపిక తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని పరిగి బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం కేక్ కటింగ్ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

**లేపాక్షి:** వైఎస్సార్ జయంతిని సోమవారం ఉదయం 9 గంటలకు లేపాక్షిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తెలిపారు.

**చిలమత్తూరు:** దివంగత మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను నేడు సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి పేర్కొన్నారు.

**అగళి:** స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ జయంతిని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప తెలిపారు.



హిందూపురంలోని పరిగి బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్న దృశ్యం

**గోరంట్ల:** వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని విజయకుమార్ పెట్రోల్ బంకు నుంచి గుమ్మయ్యగారిపల్లి వైఎస్సార్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు.

**గుడిబండ:** మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జిబి శివకుమార్, మండల కన్వీనర్ డిఎల్ యంజారేగౌడ్ తెలిపారు.

**వైఎస్సార్ విగ్రహం ముస్తాబు**

**హిందూపురం:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని హిందూపురంలోని పరిగి బస్టాండ్‌లో ఆయన విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం పెద్ద ఎత్తున జయంతి కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అన్నదానం చేపడుతున్నారు.

## నివాళులర్పించిన మాజీ మంత్రి



రామాంజినమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

**రొద్దం:** మండల పరిధిలోని చిన్నగువ్వలపల్లి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి భార్య రామాంజినమ్మ దైవదర్శనానికి వెళ్తూ చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ ఇన్‌చార్జ్ ఉషశ్రీచరణ్ ఆదివారం చిన్నగువ్వలపల్లికి చేరుకుని రామాంజినమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**హిందూపురం:** హిందూపురం మండలంలోని గోళ్లాపురం గ్రామంలో నాలుగు రోజుల క్రితం టీడీపీ నాయకులు జరిపిన దాడిలో గాయపడి మృతిచెందిన సతీష్ కుమార్ కుటుంబాన్ని కార్మిక సంఘం పరామర్శించింది. అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసహాయం అందించారు. రవికుమార్ మాట్లాడుతూ ఇంత దారుణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఉపాధ్యక్షుడు పి.బాబు, నాయకులు సురేష్, నరసింహమూర్తి, రామకృష్ణ, జగదీష్ మంజునాథ్, చంద్రశేఖర్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

## విత్తన ఉండలతో పచ్చదనం పెంపు

**పావగడ:** సీడ్ బాల్స్( విత్తన ఉండలు) తో అరణ్యాభివృద్ధి సాధ్యమని అరసికెరె ప్రభుత్వ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు జిహెచ్ రేణుకారాజ్ అన్నారు. స్థానిక పరిసర యువ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీడ్ బాల్స్ నాటివేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో కొండలు, అడవులు, మైదాన ప్రాంతాలలో సీడ్ బాల్స్ చల్లితే పచ్చదనం పెరిగి అడవులు విస్తరిస్తాయన్నారు.



విత్తన ఉండలు నాటుతున్న యువకులు

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**గోరంట్ల/ పెనుకొండ/హిందూపురం టౌన్/సోమందేపల్లి:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోరంట్ల బస్టాండ్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్, యంఈఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. సైకిల్ నరసింహులు, వానవోలు నారాయణ, ఓబులేశు పాల్గొన్నారు. పెనుకొండ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని, మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. హంటర్ ప్రసాద్, రాము, నరసింహులు పాల్గొన్నారు. హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఎంఆర్‌పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కౌన్సిలర్, ఎంఆర్‌పీఎస్ తాలూకా అధ్యక్షుడు సతీష్ కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆంజినేయులు, శ్రీరాములు, నాగార్జున, నరసింహులు, నరసా పాల్గొన్నారు. సోమందేపల్లిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. నరసింహ మూర్తి, వెంకటేష్, రామాంజినేయులు పాల్గొన్నారు.



గోరంట్లలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

### ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

**ధర్మవరం అర్బన్:** ప్రభుత్వ నిబంధనలు పాటించని జీవనజ్యోతి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని పీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాల ముందు ఆదివారం పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నిరంజన్‌యాదవ్ పోస్టర్లను విడుదల చేశారు. ట్రస్ట్ పేరుతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సాయిరెడ్డి, మురళి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

### నేలకోటమ్మ శత జయంత్యుత్సవాలు

**ముదిగుబ్బ:** మర్తాడు గ్రామంలో నేలకోటమ్మ దేవత శత జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలు, వెండి ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో వేద పారాయణం, కలశపూజలు, దీక్ష హోమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

### అయోధ్య, కాశీకి బస్సు సర్వీస్ ప్రారంభం



ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డీపీటీఓ మధుసూదన్

**మడకశిర:** అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం మడకశిర డిపో నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఈబస్సు ఆదివారం మడకశిర నుంచి అయోధ్య, కాశీకి బయల్దేరింది. డీపీటీఓ(జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి) మధుసూదన్ ప్రారంభించారు. ఈబస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లే యాత్రికులు ఆర్టీసీ అధికారులను సంప్రదించి టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జ్ హంపన్న, ఎస్టీఐ రవి, ఈయూ రీజనల్ సంయుక్త కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

### ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



నూతన కమిటీతో పాత్రికేయులు

**హిందూపురం టౌన్:** పట్టణంలోని ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ కుమార్ ఎన్నికయ్యారు. కోశాధికారి పదవికి ఫణిభూషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్, పూల శ్రీనివాసులు, జాకబ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. త్వరలో పూర్తి స్థాయిలో నూతన కమిటీ ఎంపిక చేయనున్నారు.

### వైద్య శిబిరాలు పేదలకు వరం



వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

**పావగడ:** ఆరోగ్య శిబిరాలు పేదకు వరమని తిరుమణి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు లోకేశ్ చౌదరి అన్నారు. తిరుమణి గ్రామంలో హెల్ప్ సొసైటీ, సప్తగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీకాంత్, లయ, నందిని, నవీన్ కుమార్, ఉష పాల్గొన్నారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**రొళ్ల:** తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నేడు ప్రజా సమస్యల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించాలని సూచించారు.

### అనంత గంగమ్మకు బోనాలు

**తలుపుల:** రాజనాలవాండ్లపల్లి సమీపంలోని అనంత గంగమ్మకు గ్రామస్తులు ఆదివారం బోనాలు పట్టే కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామ దేవతలైన బొడ్రాతమ్మలకు శుద్ధిచేసి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాల గంపలు ఎత్తుకొని తప్పెట్లతో ఊరేగింపుగా అనంత గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆషాఢంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తే వర్షాలు కురిసి పంటలు పండుతాయని గ్రామస్తుల నమ్మకం.

### పరిగిలో నేడు వైఎస్సార్ జయంతి

- హాజరు కానున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

**పరిగి:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పరిగి మండల కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.